భారత్-పాక్ మధ్య అమెరికా జోక్యమేంది?

సీపీఎం ప్రధాన కార్యదర్శి ఎంఏ బేబీ డిమాండ్

హైదరాబాద్, మే 14 (నమస్తే తెలంగాణ): భారత్- పాక్ కాల్పుల విరమణపై అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ ముందుగా ప్రకటన చేయడంపై సీపీఎం ప్రధాన కార్యదర్శి ఎంఏ బేబీ అభ్యంతరం వ్యక్తంచేశారు. ఇరుదేశాల మధ్య మూడో దేశం మధ్యవర్తిత్వం అనవసరమని తెలిపారు. సీపీఎం రాష్ట్ర కమిటీ సమావేశాల్లో పాల్గొనేందుకు హైదరాబాద్ వచ్చిన బేబీ పార్టీ రాష్ట్ర కార్యాలయంలో పార్టీ పొలిట్‌బ్యూరో సభ్యుడు బీవీ రాఘవులు, రాష్ట్ర కార్యదర్శి జాన్‌వెస్లీతో కలిసి మీడియా సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా బేబీ మాట్లాడుతూ ఆపరేషన్ సిందూర్ నేపథ్యంలో కేంద్రప్రభుత్వం తక్షణమే పార్లమెంట్ ప్రత్యేక సమావేశాలు ఏర్పాటు చేసి, వివరాలను దేశప్రజలకు వెల్లడించాలని డిమాండ్ చేశారు. పహల్గాంలో ఉగ్రదాడిలో 26 మంది పర్యాటకులు చనిపోవడంపై ఆవేదన వ్యక్తంచేశారు. ఉగ్రవాదాన్ని అణచివేయాలని, పాకిస్థాన్‌పై అంతర్జాతీయ స్థాయిలో ఒత్తిడి తీసుకురావాల్సిన అవసరముందని చెప్పారు. యుద్ధం ముగిసిందని మోదీ చెప్పంటే, పాక్ మాత్రం కశ్మీర్‌లో కాల్పులు జరుపుతూనే ఉందని గుర్తుచేశారు. జూన్ 3న ఢిల్లీ వేదికగా సీపీఎం కేంద్ర కమిటీ సమావేశాలు జరుగుతాయని, కేరళలో మళ్లీ ఎల్‌డీఎఫ్ అధికారంలోకి వస్తుందని చెప్పారు. ఆపరేషన్ కగార్‌ను నిలిపివేయడం శుభపరిణామమని బీవీ రాఘవులు అన్నారు. శంషాబాద్‌లోని కరాచీ బేకరీ మీద దాడికి పాల్పడిన వారిపై కఠినచర్యలు తీసుకోవాలని జాన్‌వెస్లీ డిమాండ్ చేశారు.

2నుంచి రాష్ట్రవ్యాప్తంగా భూభారతి సదస్సులు

మంత్రి పొంగులేటి వెల్లడి

హైదరాబాద్, మే 14 (నమస్తే తెలంగాణ): రాష్ట్రవ్యాప్తంగా జూన్ 2నుంచి భూభారతి సదస్సులు నిర్వహించనున్నట్టు రెవెన్యూశాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాస్‌రెడ్డి బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. భూ సమస్యలకు పరిష్కారం చూపాలన్న లక్ష్యంతో ఏప్రిల్ 14న భూభారతి చట్టాన్ని ప్రారంభించినట్టు ఆయన పేర్కొన్నారు. ఏప్రిల్ 17నుంచి 30వరకు నాలుగు మండలాల్లో, ఈనెల 5నుంచి 30వరకు 28 మండలాల్లో పైలట్ ప్రాజెక్టు కింద సదస్సులు నిర్వహించినట్టు వివరించారు. జూన్ 2నుంచి అన్ని మండలాల్లో రెవెన్యూ సదస్సులు నిర్వహించాలని నిర్ణయించామని ఆయన వెల్లడించారు.

28 బార్లకు దరఖాస్తుల ఆహ్వానం

హైదరాబాద్, మే 14 (నమస్తే తెలంగాణ): రాష్ట్రంలోని జీహెచ్‌ఎంసీ పరిధిలో 24, మహబూబ్‌నగర్, బోధన్, నిజామాబాద్, సరూర్‌నగర్ జల్‌పల్లి మున్సిపాలిటీల్లో ఒక్కొక్క బార్ కలిపి మొత్తం 28(2బీ) బార్లకు ప్రొహిబిషన్, ఎక్సైజ్ శాఖ దరఖాస్తులను ఆహ్వానించింది. ఈనెల 15 నుంచి జూన్ 6 వరకు దరఖాస్తులను స్వీకరించనున్నట్టు తెలిపింది. గతంలో 2బీ బార్లకు దరఖాస్తులు పిలిచిన సందర్భంలో బార్ లైసెన్స్ పొంది లైసెన్స్ ఫీజు చెల్లించకపోవడం, ఇతర కారణాలతో రద్దు చేసుకున్న వాటిని తిరిగి పునరుద్ధరించడంలో భాగంగా దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్టు అధికారులు తెలిపారు.

ఒకేరకం ఎపిక్ నంబర్ల సమస్యకు చెక్

హైదరాబాద్, మే 14 (నమస్తే తెలంగాణ): భారత ఎన్నికల సంఘం (ఈసీఐ) ఎన్నికల జాబితాను సరిచేసి ఆధునీకరించడంలో భాగంగా 20 ఏండ్లుగా అపరిష్కృతంగా ఉన్న ఓ సమస్యను కూడా పరిష్కరించింది. 2005 నుంచి వేధిస్తున్న ఒకే రకం ఎపిక్ (ఎలక్టోరల్ ఫొటో ఐడెంటిటీ కార్డు) నంబర్ల సమస్యను తీర్చింది. వివిధ ఎన్నికల అధికారులు (ఈఆర్‌వోలు) ఒకే సిరీస్‌ను ఉపయోగించడం వల్ల ఈ సమస్య తలెత్తినట్టు ఈసీఐ వర్గాలు తెలిపాయి.

నూతన ఆర్టీఐ కమిషనర్ల ప్రమాణ స్వీకారం

హైదరాబాద్, మే 14 (నమస్తే తెలంగాణ): తెలంగాణ రాష్ట్ర సమాచార హక్కు చట్టం కమిషన్(ఆర్టీఐ)కు కొత్తగా నియమితులైన నలుగురు కమిషనర్లు బుధవారం ప్రమాణ స్వీకారం చేశారు. సచివాలయంలో నిర్వహించిన ఈ కార్యక్రమానికి సీఎం రేవంత్‌రెడ్డి హాజరయ్యారు. చీఫ్ కమిషనర్ జీ చంద్రశేఖర్‌రెడ్డి నూతన కమిషనర్లుగా నియమితులైన పీవీ శ్రీనివాసరావు, మొహిసినా పర్వీన్, దేశాల భూపాల్, బోరెడ్డి అయోధ్యరెడ్డిలతో ప్రమాణ స్వీకారం చేయించారు. ఈ సందర్భంగా సీఎం నూతన కమిషనర్లకు పుష్పగుచ్ఛం అందించి అభినందనలు తెలిపారు. వీరు మూడేండ్ల పాటు ఈ పదవిలో కొనసాగనున్నారు.

మిల్లర్లకు 'రెట్టింపు' లబ్ధి!

- రైస్ మిల్లర్ల ఒత్తిడికి తలొగ్గిన సివిల్ సప్లయ్ అధికారులు
- సామర్థ్యానికి మించి రెండింతల ధాన్యం ఇవ్వాలని నిర్ణయం
- డిఫాల్ట్ మిల్లుల్లోనూ అనుమతి
- అవినీతికి రాచమార్గం వేశారని సర్వత్రా ఆరోపణలు
- ఒకవైపు నిర్ణీత సమయంలో సీఎంఆర్ ఇవ్వడం లేదంటూ మిల్లుల్లో తనిఖీలు, దాడులు
- ఇప్పుడేమో మిల్లర్లకు రెండింతల ధాన్యం కేటాయింపులు..!
- తెరవెనుక చక్రం తిప్పుతున్న ఓ ఎమ్మెల్యే, ఓ బడా మిల్లర్

హైదరాబాద్, మే 14 (నమస్తే తెలంగాణ): రైస్ మిల్లర్ల ఒత్తిడికి పౌరసరఫరాల సంస్థ తలొగ్గిందా? ధాన్యం కేటాయింపుల్లో అవినీతికి రాచమార్గం వేసిందా? నిజామాబాద్ జిల్లాకు చెందిన ఒక 'పెద్దమనిషి' ఆదేశాలే అధికారులకు శిరోధార్యమా? మిల్లర్లు సకాలంలో సీఎంఆర్ (బియ్యం) ఇవ్వడం లేదంటూ దాడులు చేసి కేసులు పెడుతున్న సివిల్ సప్లయ్ సంస్థ.. మళ్లీ అదే మిల్లులకు రెట్టింపు ధాన్యం కట్టబెట్టడం వెనుక ఆంతర్యమేంటి? డిఫాల్ట్ మిల్లులకు గింజ ధాన్యం కేటాయించబోమన్న అధికారులు.. మళ్లీ అదే మిల్లుల్లో ధాన్యం నిలువ చేసేందుకు అనుమతివ్వడం దేనికి సంకేతం? ఇవీ సివిల్ సప్లయ్ అధికారుల తాజా నిర్ణయాలపై వెల్లువెత్తుతున్న ప్రశ్నలు. సదరు శాఖ వ్యవహారశైలి కూడా ఈ ప్రశ్నలకు బలం చేకూర్చేలా ఉన్నది. యాసంగిలో మిల్లులకు ధాన్యం కేటాయింపుల విషయంలో సివిల్ సప్లయ్ ఇటీవల రెండు కీలక నిర్ణయాలు తీసుకున్నది. ఇందులో ఒకటి మిల్లులకు మిల్లింగ్ సామర్థ్యానికి రెట్టింపు ధాన్యం కేటాయించడం కాగా, మరొకటి డిఫాల్ట్ మిల్లుల్లో ధాన్యం నిల్వ చేసేందుకు అనుమతివ్వడం. ఈ రెండు నిర్ణయాలూ అవినీతికి ఆజ్యం పోసేలా, కొంత మంది మిల్లర్ల దోపిడీకి సహకరించేలా ఉన్నాయనే ఆరోపణలు సర్వత్రా వినిపిస్తున్నాయి. మిల్లర్లు అడిగారు కాబట్టే ఈ నిర్ణయాలు తీసుకున్నట్టు సివిల్ సప్లయ్ అధికారులు పేర్కొనడం గమనార్హం. దీంతో మిల్లర్ల ఒత్తిడికి తలొగ్గే ఈ నిర్ణయాలు తీసుకున్నారా? అనే సందేహాలు వ్యక్తమవుతున్నాయి.

ఒకవైపు దాడులు, కేసులు.. మరోవైపు రెట్టింపు కేటాయింపులు!

మిల్లులకు ధాన్యం కేటాయింపుల విషయంలో సివిల్ సప్లయ్ ద్వంద్వ వైఖరి అవలంబిస్తున్నది. ఒకవైపు, సకాలంలో సీఎంఆర్ ఇవ్వడం లేదంటూ మిల్లులపై దాడులు చేస్తూ కేసులు నమోదుచేస్తున్న అధికారులు.. ఇప్పుడు అవే మిల్లులకు సామర్థ్యానికి మించి రెట్టింపు ధాన్యం కేటాయిస్తున్నారు. ఇన్నాళ్లు గత ప్రభుత్వంపై, మిల్లర్లపై సివిల్ సప్లయ్ అధికారులు, ప్రభుత్వ పెద్దలు తీవ్ర ఆరోపణలు చేశారు. రూ.వేల కోట్ల విలువైన ధాన్యం మిల్లుల్లో ఉండిపోయిందని, మిల్లర్లు సకాలంలో సీఎంఆర్ ఇవ్వకపోవడంతో సంస్థకు భారీ నష్టం వాటిల్లిందని విమర్శించారు. కానీ, ప్రస్తుత నిర్ణయాలను పరిశీలిస్తే, రైస్ మిల్లర్ల ఒత్తిడికి తలొగ్గిన కాంగ్రెస్ సర్కారు.. వారితో కుమ్మక్కయిందనే ఆరోపణలు వినిపిస్తున్నాయి. ఇందులో భాగంగానే మిల్లులకు రెట్టింపు ధాన్యం కేటాయింపు నిర్ణయం తీసుకున్నదనే విమర్శలొస్తున్నాయి. మిల్లింగ్ సామర్థ్యానికి సరిపడ ధాన్యం ఇస్తేనే సకాలంలో బియ్యం ఇవ్వని మిల్లర్లు.. అంతకు రెట్టింపు ధాన్యం కేటాయిస్తే ఏవిధంగా సీఎంఆర్ ఇస్తారనే ప్రశ్నలు ఉత్పన్నమవుతున్నాయి. ఈ యాసంగి సీఎంఆర్‌ను ఇచ్చేందుకు ఎఫ్‌సీఐ ఈ ఏడాది సెప్టెంబర్ వరకు గడువు ఇచ్చింది. అయితే, నాలుగు నెలల్లోనే కొన్ని మిల్లులు రెట్టింపు సామర్థ్యం బియ్యాన్ని ఏ విధంగా ఇవ్వగలుగుతాయన్నది ప్రశ్న. ఒకవేళ, ఎఫ్‌సీఐ సీఎంఆర్ గడువు పొడిగిస్తుందని భావించి అధికారులు ఈ నిర్ణయం తీసుకొని ఉండొచ్చు. అయితే ఎఫ్‌సీఐ గడువు పొడిగించకపోతే పరిస్థితేమిటి? దీనివల్ల కలిగే నష్టానికి బాధ్యులు ఎవరు? అనే ప్రశ్నలు తలెత్తుతున్నాయి. అయితే అధికారులు మాత్రం రెట్టింపు కేటాయింపులను సమర్థించుకునే ప్రయత్నం చేశారు. యాసంగిలో భారీగా ధాన్యం వస్తున్నదని, అకాల వర్షాల నేపథ్యంలో ఈ ధాన్యాన్ని వెంట వెంటనే మిల్లులకు తరలించేందుకు ఈ నిర్ణయం తీసుకున్నట్టు అధికారులు పేర్కొన్నారు.

డిఫాల్ట్ మిల్లులకు పరోక్ష సహకారం?

రాష్ట్రంలోని డిఫాల్ట్ మిల్లులకు, కేసులు నమోదైన మిల్లులకు ఎట్టి పరిస్థితుల్లోనూ ధాన్యం కేటాయించే ప్రసక్తే లేదని ప్రభుత్వం గతంలో ప్రకటించింది. కానీ, తాజాగా ఆయా మిల్లుల్లో ధాన్యం నిల్వ చేసేందుకు అనుమతిస్తూ సివిల్ సప్లయ్ ఉత్తర్వులు జారీ చేసింది. నాన్ డిఫాల్ట్ మిల్లుల్లో ధాన్యం నిల్వకు స్థలం లేనిపక్షంలో ఆయా మిల్లులు డిఫాల్ట్ మిల్లులను వినియోగించుకోవచ్చని పేర్కొన్నది. అయితే ఆ ధాన్యం కేటాయింపులన్నీ నాన్ డిఫాల్ట్ మిల్లు పేరుపైనే ఉంటాయని తెలిపింది. ఇక్కడే పెద్ద గూడుపుఠాణి జరిగినట్టు ఆరోపణలు వినిపిస్తున్నాయి. ఈ వెసులుబాటును ఆసరాగా చేసుకొని జిల్లాల్లో పెద్ద ఎత్తున డిఫాల్ట్ మిల్లులకు ధాన్యం కేటాయింపులు జరిగినట్టు తెలిసింది. పేరుకేమో ఆ ధాన్యం నాన్ డిఫాల్ట్ మిల్లర్‌ది.. వాడుకునేది మాత్రం డిఫాల్ట్ మిల్లర్లేననే ఆరోపణలు వినిపిస్తున్నాయి. ఇందుకు సంబంధించి పలు జిల్లాల్లో పెద్ద మొత్తంలో చేతులు మారుతున్నట్టు ఆరోపణలు గుప్పుమంటున్నాయి. సివిల్ సప్లయ్ తీసుకున్న ఈ నిర్ణయం అవినీతికి ఆస్కారం ఇచ్చేలా ఉన్నదనే విమర్శలొస్తున్నాయి.

ఆ 'పెద్ద మనిషి'కి జీహుజూర్!

సివిల్ సప్లయ్ తాజా నిర్ణయాల వెనుక ఉమ్మడి నిజామాబాద్‌కు చెందిన ఇద్దరు కీలక వ్యక్తులు చక్రం తిప్పినట్టు ఇటు మిల్లింగ్ ఇండస్ట్రీ, అటు సివిల్ సప్లయ్ వర్గాల్లో జోరుగా చర్చ జరుగుతున్నది. ఇందులో ఒకరు బడా మిల్లర్ కాగా, మరొకరు కీలక పదవి కోసం పోటీ పడుతున్న అధికార పార్టీ ఎమ్మెల్యే అని తెలిసింది. ఈ ఇద్దరూ కలిసి సివిల్ సప్లయ్‌ని శాసిస్తున్నారనే ఆరోపణలు పెద్ద ఎత్తున వినిపిస్తున్నాయి. ఈ ఇద్దరు ఏ నిర్ణయం తీసుకున్నా.. ఏది అడిగినా కాదనకుండా అధికారులంతా 'జీ హుజూర్' అంటున్నట్టు తెలిసింది.

టీపీసీసీ చీఫ్ చాంబర్ వద్ద ఆందోళన చేస్తున్న మహిళా కాంగ్రెస్ నేతలు

పదవుల్లో మహిళలకు అన్యాయం

- పోస్టులన్నీ పీసీసీ చీఫ్ మహేశ్‌కుమార్ బంధువులకేనా?
- గాంధీభవన్‌లోని చాంబర్ ఎదుట మహిళా నేతల ధర్నా

హైదరాబాద్, మే 14 (నమస్తే తెలంగాణ): కాంగ్రెస్‌లో పదవుల లొల్లి కొనసాగుతూనే ఉంది. కాంగ్రెస్ కమిటీల్లో మహిళలకు ప్రాధాన్యత ఇవ్వడం లేదని గాంధీభవన్‌లోని పీసీసీ చీఫ్ మహేశ్‌కుమార్ గౌడ్ చాంబర్ ఎదుట బుధవారం మహిళా కాంగ్రెస్ నేతలు నిరసనకు దిగారు. ప్రభుత్వం, కార్పొరేషన్ పదవుల్లోనూ మహిళా నేతలకు సరైనా ప్రాధాన్యత దక్కడంలేదని మహిళా కాంగ్రెస్ రాష్ట్ర అధ్యక్షురాలు సునీతారావు ఆధ్వర్యంలో ఆందోళనకు దిగారు. పదవులన్నీ పీసీసీ చీఫ్ మహేశ్‌కుమార్‌గౌడ్ బంధువులకే ఇచ్చుకుంటున్నారని ఆరోపించారు. ఎన్నో ఏండ్ల నుంచి పార్టీని నమ్ముకుని పనిచేస్తున్న తమకు కాంగ్రెస్‌లో తగిన గుర్తింపు దక్కడం లేదని ఆవేదన వ్యక్తంచేశారు. కార్పొరేషన్లు, పార్టీ కమిటీల్లో మహిళా కాంగ్రెస్ నేతలకు అవకాశం కల్పించాలని, పార్టీ అధిష్ఠానం ఆదేశాల మేరకు మహిళా డిక్లరేషన్‌ను అమలు చేయాలని డిమాండ్ చేశారు. మరోవైపు మహిళా కాంగ్రెస్ అధ్యక్షురాలు సునీతారావు వ్యాఖ్యలపై చర్యలు తీసుకోవాలంటూ కొందరు నేతలు క్రమశిక్షణ కమిటీకి ఫిర్యాదు చేసినట్టు గాంధీభవన్ వర్గాలు తెలిపాయి.

కాంగ్రెస్ పెద్దలతో టీపీసీసీ చీఫ్ భేటీ

హైదరాబాద్, మే 14 (నమస్తే తెలంగాణ): టీపీసీసీ కూర్పుపై పార్టీ అధిష్ఠానం పెద్దలతో చర్చించేందుకు ఢిల్లీ వెళ్లిన టీపీసీసీ చీఫ్ మహేశ్‌కుమార్‌గౌడ్ బుధవారం సాయంత్రం పార్టీ ప్రధాన కార్యదర్శి కేసీ వేణుగోపాల్‌తో భేటీ అయ్యారు. అలాగే పార్టీ రాష్ట్ర వ్యవహారాల ఇన్‌చార్జి మీనాక్షి నటరాజన్‌తో సమావేశమై టీపీసీసీ పదవులపై చర్చించారు. అనంతరం పార్టీ ఇన్‌చార్జితో కలిసి వేణుగోపాల్‌తో సమావేశమయ్యారు. ఈ భేటీలో టీపీసీసీ కూర్పుతోపాటు అనుబంధ కమిటీలకు ఆమోదం పొందే అవకాశాలున్నట్టు పార్టీ వర్గాలు వెల్లడించాయి.

ఎమ్మెల్యే కౌశిక్‌రెడ్డిపై రాములునాయక్ ఫిర్యాదు

ఎస్సీ, ఎస్టీ అట్రాసిటీ కేసు నమోదు

బంజారాహిల్స్, మే 14: గ్రూప్-1 పరీక్షల్లో తన కోడలితోపాటు, తాను అవకతవకలకు పాల్పడినట్టు ఆరోపణలు చేసిన ఎమ్మెల్యే పాడి కౌశిక్‌రెడ్డిపై చర్యలు తీసుకోవాలని మాజీ ఎమ్మెల్సీ రాములునాయక్ పోలీసులకు ఫిర్యాదు చేయడంతో ఎస్టీ, ఎస్టీ అట్రాసిటీ కేసు నమోదైంది. ఏప్రిల్ 14న విలేకరుల సమావేశంలో పాడి కౌశిక్‌రెడ్డి గ్రూప్ - 1 పరీక్షలు జరిగిన తీరుపై మాట్లాడారు. ఈ క్రమంలో రాములునాయక్ కోడలికి ఫస్ట్ ర్యాంక్ రావడం వెనక భారీ కుంభకోణం దాగి ఉన్నదని ఆరోపించారు. ఈ నేపథ్యంలో తమ ప్రతిష్ఠకు భంగం కలగడంతోపాటు, తమపై నిరాధార ఆరోపణలు చేసిన కౌశిక్‌రెడ్డిపై చర్యలు తీసుకోవాలని రాములునాయక్ సనత్‌నగర్ పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. దీంతో ఎస్సీ, ఎస్టీ అట్రాసిటీ కేసు నమోదు చేశారు. కాగా, కౌశిక్‌రెడ్డి మాట్లాడింది బంజారాహిల్స్ పీఎస్ పరిధిలోకి రావడంతో బుధవారం కేసును ఇక్కడకు బదిలీ చేశారు.

మనీ కొట్టు.. ట్రాన్స్‌ఫర్ పట్టు!

- డిస్కంల నుంచి జెన్‌కోకు పాకిన అధికారుల ముడుపుల దందా
- తాజాగా ఐదుగురి ఇంజినీర్ల బదిలీ

హైదరాబాద్, మే 14 (నమస్తే తెలంగాణ): రాష్ట్రంలోని విద్యుత్తు సంస్థల్లో బదిలీలు, పోస్టింగ్‌ల వెనుక భారీ ఎత్తున ముడుపులు చేతులు మారుతున్నట్టు తెలుస్తున్నది. గతంలో డిస్కంలకే పరిమితమైన ఈ దందా.. ఇప్పుడు జెన్‌కోకు కూడా పాకినట్టు, ఒక్కో బదిలీ లేదా పోస్టింగ్‌కు సంబంధిత అధికారులు రూ.5 లక్షల నుంచి రూ.10 లక్షల వరకు ముడుపులు పుచ్చుకుంటున్నట్టు సమాచారం. జెన్‌కోలో ఎలాంటి విధానం, మార్గదర్శకాలు లేకుండానే బదిలీ ఉత్తర్వులు విడుదలవుతున్నాయి. తాజాగా జెన్‌కో యాజమాన్యం ఐదుగురు ఇంజినీర్లను బదిలీ చేసింది. నేడో, రేపో మరో ముగ్గురిని బదిలీ చేసేందుకు రంగం సిద్ధమైంది. ఇతర ప్రాంతాల్లో పనిచేస్తున్న వారిని హైదరాబాద్‌కు తీసుకొచ్చి పోస్టింగ్స్ ఇస్తున్నారు. అలా ఒక చోటున్న పోస్టును జెన్‌కో ప్రధాన కార్యాలయానికి షిఫ్ట్ చేశారని ఓ ఇంజినీర్ ఆరోపించారు. ఇప్పటికైనా ఉన్నతాధికారులు అక్రమ బదిలీలను ఆపాలని కోరుతున్నారు.

పెండింగ్‌లో 214 దరఖాస్తులు

ఏటా వేసవిలో ఇంజినీర్ల బదిలీలు చేపట్టాలి. ఆ బదిలీల్లో 10 ఏండ్ల సర్వీసు పూర్తిచేసుకున్న వారికి, ఆరోగ్య సమస్యలున్నవారికి ప్రాధాన్యమివ్వాలి. కానీ, గత రెండేండ్లుగా సాధారణ బదిలీలు చేపట్టిన దాఖలాల్లేవు. జెన్‌కోలో మొత్తం 214 మంది ఇంజినీర్ల బదిలీల దరఖాస్తులను యాజమాన్యం పెండింగ్ పెట్టింది. మెడికల్ తదితర కోటాలో గత ఏడాదిన్నరగా ఒక్కరిని బదిలీ చేయలేదు. కానీ పలుకుబడితో బదిలీలు జరుగుతున్నాయి.

నేతలు చెప్పినట్టు వింటే

ఊచలు లెక్కపెడ్తరు!

- ఇంజినీర్లకు సీఎం హెచ్చరిక
- ప్రాజెక్టులకు నిధులు లేకపోయినా సర్దుబాటు చేస్తామని వెల్లడి
- నూతన ఏఈ, జేటీవోలకు నియామకపత్రాల అందజేత

హైదరాబాద్, మే 14 (నమస్తే తెలంగాణ): ప్రాజెక్టులను పూర్తిచేయాలని ఎంతో ఉత్సాహం ఉన్నా నిధుల కొరత ఉన్నదని, అయినప్పటికీ సర్దుబాటు చేస్తూ నిర్మిస్తామని సీఎం రేవంత్‌రెడ్డి చెప్పారు. ఇంజినీర్లు ప్రభుత్వానికి సహకరించాలని కోరారు. ఇరిగేషన్‌శాఖలో ఏఈ (అసిస్టెంట్ ఇంజినీర్), జేటీవో (జూనియర్ టెక్నికల్ ఆఫీసర్) పోస్టులకు ఎంపికైన 423మంది అభ్యర్థులకు నియామక పత్రాల అందించే కార్యక్రమాన్ని ఎర్రమంజిల్‌లోని జలసౌధలో బుధవారం నిర్వహించారు. ఈ కార్యక్రమానికి సాగునీటిపారుదల శాఖ మంత్రి ఉత్తమ్‌కుమార్‌రెడ్డితో కలిసి రేవంత్‌రెడ్డి ముఖ్యఅతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా సీఎం మాట్లాడుతూ నూతనంగా ఉద్యోగ బాధ్యతలు చేపట్టిన ఇంజినీర్లు తెలంగాణ పునర్నిర్మాణంలో భాగస్వాములవ్వాలని కోరారు. ప్రాజెక్టులను పూర్తిచేయాలనే సంకల్పంతో కాంగ్రెస్ ప్రభుత్వం పనిచేస్తున్నదని, అందుకే ఖాళీలను భర్తీ చేస్తున్నామని, ఇప్పటివరకు నీటిపారుదలశాఖలోనే 1161 ఉద్యోగాలను భర్తీ చేశామని వివరించారు. ఇంజినీర్లు రాజకీయ నేతలు చెప్పినట్టు చేస్తే ఊచలు లెక్కించాల్సి ఉంటుందని హెచ్చరించారు.

గ్రూప్-1ను అడ్డుకుంటున్నారు..

గ్రూప్-1 నియామకాలను పరీక్షతో సంబంధం లేనివారే అడ్డుకుంటున్నారని, కోర్టుల్లో కేసులు వేశారని సీఎం రేవంత్‌రెడ్డి ఆరోపించారు. త్వరలోనే అన్ని అడ్డంకులను అధిగమిస్తామని, గ్రూప్స్ ఉద్యోగాల నియామకాలను కూడా పూర్తి చేస్తామని చెప్పారు. అనంతరం మంత్రి ఉత్తమ్‌కుమార్‌రెడ్డి, బీసీ సంక్షేమశాఖ మంత్రి పొన్నం ప్రభాకర్‌తో కలిసి నూతన ఏఈ, జేటీవో అభ్యర్థులకు నియామకపత్రాలను అందజేశారు.

అధికారులను ఉరి తీయాలని నివేదికలు చెప్తాయా?

'ఎక్స్' వేదికగా సీఎంపై హరీశ్‌రావు ఫైర్

హైదరాబాద్, మే 14 (నమస్తే తెలంగాణ): అధికారులను ఉరి తీయాలని విజిలెన్స్, ఎన్డీఎస్ఏ నివేదికలు చెబుతాయా? ఇది ప్రజాస్వామ్యమా? లేక రేవంత్ రాచరిక రాజ్యమా? అని మాజీ మంత్రి హరీశ్‌రావు మండిపడ్డారు. ఈ మేరకు బుధవారం ఆయన 'ఎక్స్' వేదికగా ట్వీట్ చేశారు. 'బీఆర్ఎస్ ప్రభుత్వ హయాంలో ఇచ్చిన ఉద్యోగ నోటిఫికేషన్లకు నియామక పత్రాలు అందించి, తమ ఘనతగా చెప్పుకునేందుకు సీఎం తంటాలు పడ్డడు. నియామక పత్రాలు అందిస్తూ నాలుగు మంచి మాటలు చెప్పాల్సింది పోయి, అబద్ధాలు వల్లె వేసిండు. ఉద్యోగాల్లో చేరుతున్న వారిలో ఉత్సాహాన్ని నింపాల్సింది పోయి, వార్నింగ్ ఇచ్చి, భయభ్రాంతులకు గురి చేసిండు. ఇంతకంటే అజ్ఞానం ఉన్న వ్యక్తి సోమాలియా నుంచి అమెరికా వరకు ఎక్కడ వెదికినా కనిపించడు కావొచ్చు' అని హరీశ్‌రావు ఎద్దేవా చేశారు. కాళేశ్వరం ప్రాజెక్టు ద్వారా 20లక్షల ఎకరాలకు (కొత్త, స్థిరీకరణ) సాగునీరు అందించినట్టు అసెంబ్లీ సాక్షిగా మీరు విడుదల చేసిన శ్వేతపత్రంలోనే ప్రకటించారు. మళ్లీ ఇప్పుడు 50వేల ఎకరాలకు కూడా నీళ్లు ఇవ్వలేదని గోబెల్స్ ప్రచారం చేస్తున్నారని హరీశ్‌రావు దుయ్యబట్టారు.

15వ తేదీ వచ్చినా వేతనం రాలే!

- చిరుద్యోగుల జీతాలపై మంత్రి సీతక్క హామీ పాలక్కే!
- పీఆర్ఆర్డీలోని 92వేల మంది ఉద్యోగులకు ప్రతినెలా రూ.115 కోట్లు విడుదల చేస్తామని ప్రకటన
- వేతనాల కోసం పీఆర్ఆర్డీ ఉద్యోగుల ఎదురుచూపులు

హైదరాబాద్, మే 14 (నమస్తే తెలంగాణ): 'ఇకపై చిరుద్యోగులకు నెలనెలా వేతనాలు ఇస్తాం. పంచాయతీరాజ్, గ్రామీణాభివృద్ధి శాఖ (పీఆర్ఆర్డీ) పరిధిలో పనిచేసే సుమారు 92వేల మంది ఉద్యోగులకు గ్రీన్‌చానెల్ ద్వారా రూ.115 కోట్లు చెల్లిస్తాం. ప్రభుత్వ ఉద్యోగుల తరహాలో వీరికి కూడా ఒకటో తేదీనే వారి అకౌంట్లలో వేతన మొత్తాన్ని జమచేస్తాం'- ఇది ఆ శాఖ మంత్రి ధనసరి అనసూయ (సీతక్క) ఏప్రిల్‌లో చెప్పిన మాట. గతంలో కూడా ఒకసారి జనవరి నుంచి చిరుద్యోగులకు సకాలంలో వేతనాలు చెల్లిస్తామని చెప్పారు. దీంతో ఇక తమకు మంచిరోజులు రాబోతున్నాయని ఆయా ఉద్యోగులు సంబురపడ్డారు. కానీ, 15వ తేదీ వచ్చినా ఏప్రిల్ నెల వేతనం అందలేదు. పంచాయతీరాజ్, గ్రామీణాభివృద్ధి శాఖ పరిధిలో అధికారిక లెక్కల ప్రకారం.. 92 వేల మందికిపైగా పనిచేస్తున్నారు. వీరిలో మల్టీపర్పస్ వర్కర్లు 52,473 మంది, సొసైటీ ఫర్ రూరల్ డెవలప్‌మెంట్ సర్వీసెస్ సిబ్బంది 12,586 మంది, గ్రామ పంచాయతీల్లో కంప్యూటర్ ఆపరేటర్లు 1,301 మంది, మండల కంప్యూటర్ ఆపరేటర్లు 278 మంది, మండల పరిషత్‌లో పార్ట్‌టైమ్, ఫుల్‌టైమ్ వర్కర్లు 1,349 మంది, జిల్లా పరిషత్‌లో పార్ట్ టైమ్, ఫుల్‌టైమ్ వర్కర్లు 171 మంది, కాంట్రాక్ట్ పంచాయతీ కార్యదర్శులు తొమ్మిది మంది, అవుట్‌సోర్సింగ్ పంచాయతీ కార్యదర్శులు 792 మంది, డీపీఎంలు 31 మంది, జూనియర్ పంచాయతీ కార్యదర్శులు 817 మంది, పేదరిక నిర్మూలనా సంస్థ (సెర్ప్) ఉద్యోగులు 22,011 మంది, పీడీయూ జీకేవై సిబ్బంది 107, ఎస్ఎస్‌బీఎం 70, ఎస్ఎస్ఏఏటీ 180 ఇలా మొత్తం 92,175 మంది చిరుద్యోగులకు సకాలంలో వేతనాలు రావడం లేదు. గతంలో ఒక్కోసారి ఆరు నుంచి ఎనిమిది నెలల వరకు పెండింగ్ పడిన సందర్భాలు కూడా ఉన్నాయి.

ఆర్థిక శాఖ వద్ద పెండింగ్‌లో ఫైల్

ఉపాధిహామీ పథకంలో పనిచేసేవారితోపాటు మల్టీపర్పస్ ఉద్యోగులకు నాలుగు నెలల వేతనాలు పెండింగ్‌లో ఉండగా, ప్రభుత్వం ఇటీవల మూడు నెలల వేతనాలు ఇచ్చింది. మరో నెల వేతనం పెండింగ్‌లో పెట్టింది. 15వ తేదీ వచ్చినా ఏప్రిల్ నెల వేతనం చేతికి అందలేదు. ఉద్యోగ సంఘాల నేతలు డీపీవోలను అడిగితే.. తమకు తెలియదని చెప్తున్నారు. వేతన సమస్యను ఉద్యోగ సంఘాల నేతలు మంత్రి సీతక్క దృష్టికి తీసుకెళ్లారు. దీంతో ఇకపై ప్రతినెలా సకాలంలో వేతనాలు చెల్లించాలని ఆదేశించారు. ప్రతినెలా 25వ తేదీ వరకు ఆన్‌లైన్ ద్వారా ఉద్యోగుల హాజరు వివరాలు సేకరించి, 26వ తేదీనే బిల్లులు సిద్ధం చేయాలని, ఆ శాఖ కార్యదర్శి లోకేశ్‌కుమార్.. డైరెక్టర్ సృజనకు ఆదేశాలు ఇచ్చినట్టు వార్తలు వచ్చాయి. దీంతో ఉద్యోగులు సంబరపడ్డారు. కానీ, 15వ తేదీవరకు సిబ్బందిలో ఒక్కరికీ కూడా వేతనాలు పడలేదు. వేతనాలకు సంబంధించిన జీవో జారీ కాలేదు. గ్రీన్‌చానెల్ ద్వారా వేతనాలు చెల్లించే విధానానికి సంబంధించి ఫైల్ ఆర్థిక శాఖ వద్ద పెండింగ్‌లో ఉన్నట్టు తెలిసింది.

> సకాలంలో వేతనాలు చెల్లించాలి
>
> రాష్ట్రవ్యాప్తంగా పనిచేస్తున్న పంచాయతీ కార్మికులకు నెలనెలా సకాలంలో వేతనాలు చెల్లించాలి. వేసవి ఎండల తీవ్రత తగ్గే వరకు ఉదయం ఆరు గంటల నుంచి 11 గంటల వరకు పని చేసుకొనేలా అనుమతించాలి. పంచాయతీ కార్మికుల ప్రాణాలు, ఆరోగ్యాన్ని దృష్టిలో పెట్టుకొని ప్రభుత్వం ఒక్క పూట పనికి అనుమతి